క్లుప్తంగా

అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: రైతుబీమాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో రంగు సృజన అన్నారు. బుధవారం మండలంలోని వంజీరి గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతుబీమా దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. సర్పంచ్ ముంజం రమేశ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



నాటిన మొక్కల వద్ద ఎంపీపీ

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని మొవాడ్ ఆశ్రమ పాఠశాలను బుధవారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ తనిఖీ చేశారు. భోజన శాల పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం మొవాడ్, అడాదస్నాపూర్, వావుదం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీటీసీలు లింగు, సావిత్రి, మల్లేష్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో చంద్రశేఖర్, సర్పంచ్‌లు కీర్తన్ రావ్, లింగు, బాదుపటేల్, ఫారెస్టు సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పుస్తకాల ర్యాకులు పంపిణీ



ర్యాకులు అందజేస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: గ్రంథాలయ పుస్తకాలను భద్రపర్చుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ర్యాకులను ఎంఆర్‌సీ కార్యాయంలో ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ పంపిణీ చేశారు. బుధవారం నెహ్రూనగర్ పాఠశాలకు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 19 మన ఊరు మన బడి పాఠశాలలు ఉండగా, వాటికి ఇటీవల గ్రంథాలయ పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. పుస్తకాల కోసం ర్యాకులు అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 16 ర్యాకులు మంజూరయ్యాయని, రెండో విడతలో 3 ర్యాకులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎంఐఎస్ అశ్విని, సీసీవో మహేందర్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దహెగాం: పాత పెన్షన్ విధానం సాధన రథయాత్ర పోస్టర్‌ను టీఎస్ సీపీఎస్ఈయూ మండల అధ్యక్షుడు కంబాల జయేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23న కాగజ్‌నగర్ పట్టణంలో పటేల్ గార్డెన్‌లో పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ నిర్మల, టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్యాంకుమార్, ఉపాధ్యాయులు రవి, శివ, సాయి, రాజేశ్, శ్రీనివాస్, సంతోష్, కుమారస్వామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : మహావీరుడు
కాగజ్‌నగర్
వెంకటరమణ : మహావీరుడు
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.100
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	80
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజ	60

-ఆసిఫాబాద్‌అర్బన్

రైతుబీమాతో ధీమా!

- దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు
- ఆగస్టు 5 వరకు గడువు



కెరమెరిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో వెంకటేశ్



కౌటాలలో రైతుబీమా చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

కెరమెరి/కౌటాల: ఆపత్కాలంలో అన్నదాత కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకం తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా ఏ కారణంతోనైనా రైతు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు అందించి ఆర్థిక భరోసా కల్పిస్తుంది. బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుండగా, రైతు మృతి చెందినట్లు వ్యవసాయాధికారులకు సమాచారమిస్తే క్షేత్రస్థాయిలో విచారించి పరిహారం అందిస్తున్నారు. కాగా కొత్తగా పట్టాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవడంతో పాటు ప్రస్తుత లబ్ధిదారులు ఏవైనా మార్పులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అర్హులైన రైతులు ఆగస్టు 5వరకు మండల వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

కౌటాలలో..

కౌటాల మండల వ్యాప్తంగా మొత్తం 7,439 మంది రైతులుండగా అందులో 18 –59 సంవత్సరాల వయస్సు గల వారు 4,486 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 3,866 మంది బీమా చేసుకోగా మిగతా 417 మంది దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. వీరికి ఒక్కొక్కరికి ప్రభుత్వం ఏడాదికి రూ.3,486 చొప్పున ప్రీమియం చెల్లిస్తోంది. ఈ పథకం ప్రారంభమై ఐదేళ్లు కావస్తుండగా ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 127 మంది మృతి చెందగా బాధిత కుటుంబాలకు రూ.6కోట్ల 35 లక్షలు చెల్లించినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పోడు పట్టాలు పొందిన రైతులు సైతం రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంటున్నారు.

కెరమెరిలో..

కెరమెరి మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 1204 మందికి అటవీ హక్కుల పట్టాలు అందాయి. వారంతా ప్రస్తుతం రైతుబంధు, రైతుబీమాకు అర్హులయ్యారు. 2005 తర్వాత పోడు భూములు సాగు చేస్తున్నట్లు ఆధారాలు చూపిన గిరిజన రైతులకు మొదటి విడతలో భాగంగా 1204 మందికి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను ప్రభుత్వం అందించింది. కాగా రెండో విడతలో మరో 586 పట్టాలు వచ్చాయని, త్వరలో వాటి పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

దరఖాస్తుదారుల అర్హతలు..

దరఖాస్తుదారులు తప్పనిసరిగా పట్టా పాసుపుస్తకం కలిగి ఉండాలి. ఆధార్‌కార్డులో వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఈ ఏడాది జూన్ 19 వరకు పట్టాపాస్ పుస్తకం పొందిన రైతులు మాత్రమే అర్హులు. రైతులు స్వయంగా కార్యాలయాలకు వెళ్లి అధికారి సమక్షంలో దరఖాస్తు చేయాలి. పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు అందజేయాలి.

వివరాలు అందించాలి

నూతనంగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం ఆగస్టు 5లోగా దరఖాస్తు చేయాలి. పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలతో పాటు నామినీ వివరాలతో స్థానిక ఏఈవోలకు దరఖాస్తులు అందజేయాలి.

- ఎన్. గోపీకాంత్,
మండల వ్యవసాయాధికారి, కెరమెరి

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



కౌటాల: నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులు



కాగజ్‌నగర్‌రూరల్: నిరసన తెలుపుతున్న కార్మికులు



కెరమెరి: సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారం 14వ రోజుకు చేరుకుంది. వర్షంలోనూ కార్మికులు తమ సమ్మె విరమించడం లేదు. కార్మికులు గడ్డల వెంకటేశ్, రాందాస్, నరేశ్, కృష్ణ, అనిల్, సంతోష్, స్వామి, వాసుదేవ్, శ్రీకాంత్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్లతో గ్రామపంచాయతీ కార్మికులు బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్మికుల సంఘం నాయకులు రమేశ్, పావని, సంధ్య, చైన్‌రావు, ధర్మయ్య, మురళీ, గణేష్, సురేందర్, రామయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 14వ రోజు కొనసాగింది. కార్మికులు మోరేశ్వర్, నాగేశ్, రాజారాం, బానిత్, నానయ్య తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న కుట్రలను మానుకోవాలని జేఏసీ నాయకులు బోగే ఉపేందర్, రమేశ్‌లు అన్నారు. మండలంలోని గోలేటి, నవేగాం, వంకులం పంచాయతీల్లో పని చేస్తున్న తాత్కాలిక సిబ్బందిని బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. కాగా సమ్మెకు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఓదెలులు సంఘీభావం తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో గౌరీశంకర్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో అపరిశుభ్రత లోపించకుండా చూడాలన్నారు. హరితహారం పనులు సక్రమంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో సోహెబ్, గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాల సీజన్‌లో ప్రజలు విద్యుత్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ ఫిరోజ్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లలో బట్టలు ఆరవేసే దండానికి విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలని, విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లకు ఎలాంటి అతుకులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఆరుబయట ఉన్న విద్యుత్ స్తంభాలకు తాకొద్దని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉంటే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. సమస్య ఉంటే లైన్‌మెన్ గోపాల్ సెల్ నంబర్ 9177505902, శివరాం 89784 94174, ఫోర్‌మెన్ 94935 46691, 9440814181, లైన్ ఇన్‌స్పెక్టర్ 9493546713లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా బోనాలు



సందీప్‌నగర్‌లో బోనాలతో మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లోని మహిళలు బుధవారం బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌నగర్ నుంచి బజార్‌వాడీ పోచమ్మ ఆలయం వరకు మహిళలు బోనమెత్తుకొని డప్పుచప్పుళ్లతో తరలివెళ్లారు. ఈసందర్భంగా శివసత్తుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు.

మొదలైన వరిసాగు పనులు

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- వరికి అనుకూలం
- నారు మడి, మొలక అలికే పనుల్లో రైతులు బిజీ



లగ్గాం శివారులోని పొలంలో ట్రాక్టర్ కేజీవీల్స్‌తో దున్నుతున్న రైతు

దహెగాం: గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వరి సాగు పనులు ప్రారంభించారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక సాగు ఆలస్యమవుతుందని రైతులు ఆందోళన చెందారు. కాగా ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వానలు పడుతుండడంతో వరి సాగు పనులు ముమ్మరం చేశారు. మొలక అలకడం, నారుమడి సిద్ధం చేసే పనులతో అన్నదాతలు బిజీ అయ్యారు.

ఎడతెరిపి లేని వానలు..

ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు పడక ఏరువాక పనులు వెనుకబడ్డాయి. సీజన్ ప్రారంభంలో పత్తి విత్తనాలు విత్తుకోగా 20 రోజుల క్రితం ముసురు వర్షానికి మొలకెత్తాయి. మొలకెత్తిన పత్తి మొక్కలు వాలిపోతున్న క్రమంలో వర్షాలు కురువాలని రైతులు పూజలు చేశారు. వర్షాలు అనుకున్న స్థాయిలో కురువకపోవడంతో రైతులు పొలాలు సిద్ధం చేయలేకపోయారు. బోర్లు ఉన్న రైతులు మాత్రం పనులు చేపట్టారు. ఈక్రమంలో గత మూడు రోజులుగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తున్నందున వరి సాగు పనులు ముమ్మరం చేశారు. పొలాల్లో మొలక అలకడం, ఒక సాలు వీల్స్ కొట్టే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. వర్షాలు కురుస్తుండడంతో వీల్స్ ట్రాక్టర్‌లకు గిరాకీ పెరిగింది.

6వేల ఎకరాల్లో వరి సాగు..

ఈ ఏడాది ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. మండల కేంద్రంతో పాటు, లగ్గాం, కమ్మర్‌పల్లి, మర్రిపల్లి, ఒడ్డుగూడ, కల్వాడ, ఐనం, చినరాస్పెల్లి గ్రామాల్లో అధికంగా వరి సాగు చేపడుతారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న ప్రస్తుతానికి చెరువులు, ప్రాజెక్టుల్లోకి ఇంకా వరద నీరు చేరలేదు. మండల కేంద్రం సమీపంలోని పెద్ద చెరువు, కల్వాడ సమీపంలోని పీపీరావు ప్రాజెక్టులోకి వరద నీరు ఇంకా రాలేదు. బోర్లు ఉన్న రైతులతో పాటు వర్షం కారణంగా పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో మరికొంత మంది రైతులు వీల్స్ కొట్టే పనులు చేపడుతున్నారు. కాగా వర్షాకాలం వరి సాగులో సన్నరకం వరిని అధికంగా సాగు చేయనున్నారు.

పది రోజుల్లో నాట్లు వేసుకోవాలి



వర్షాలు ఆలస్యం కావడంతో వరి నాట్లు వేయడంలో జాప్యం జరిగింది. ఇప్పటికైనా వారం, పది రోజుల్లోగా నాట్లు వేసుకోవాలి. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నారుమడిలో పీకపురుగు నియంత్రించడానికి గుళికలు చల్లుకోవాలి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

- వంశీకృష్ణ,
మండల వ్యవసాయాధికారి, దహెగాం

బీఆర్ఎస్ హయాంలోనే ఉచిత విద్యుత్



నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే సక్కు, నాయకులు

కెరమెరి: బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ అందుతుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం లింగాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు అందించామన్నారు. అనేక గ్రామాల్లో త్రీఫేజ్ సౌకర్యం కల్పించి, బోర్లు వేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ శోభ, జెడ్పీటీసీ ఆడే రక్కబాయి, ఎంపీటీసీ సలాం శేఖర్, సింగిల్ విండో చైర్మన్ శివాజీ, సర్పంచ్‌లు ఉన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



లోతట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శ్రీపాల్ రెడ్డి

బెజ్జూర్: వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోమిని, సుస్మీర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. ప్రజలు వాటిని దాటే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. తగు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంఈవో సోమయ్య



రెబ్బెన: పనులు పరిశీలిస్తున్న ఎంఈవో

కౌటాల: మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈవో సోమయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పలు నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు అన్ని వసతులు కల్పించడానికి ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేయాలని, పూర్తి చేసిన పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీఆర్పీ దేవన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మన ఊరు మన బడి' పనుల పరిశీలన

రెబ్బెన: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న 'మన ఊరు మన బడి' పనులను బుధవారం ఎంఈవో వెంకటేశ్వరస్వామి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత లోపించకుండా సకాలంలో పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మేడి చరణ్‌దాస్, ఉపాధ్యాయులు అనీస్ అహ్మద్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బాలాజీ

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు కేంద్రే బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ధనోరాను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు విద్యార్థులు బడికి వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట గోయగాం కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్, టీచర్ రజిత, నాయకులు కేశవరావు, ఆత్రం సురేశ్, గులాబ్‌ఖాన్, ఇర్షాద్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

కౌటాల: గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సంస్కృతిక కళాజాత బృందం సభ్యులు అన్నారు. బుధవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. చెత్తాచెదారంతో దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ, సీజనల్ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదే శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, బృందం సభ్యులు సోమశేఖర్, పురుషోత్తం, బాపు, సమ్మయ్య, రాజా, తిరుపతి, మోహన్‌నాయక్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నార్నూర్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్ అన్నారు. బుధవారం గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంకి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌వోలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోనేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్ఐలు ప్రభావతి, అనుసూయ పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీం

నార్నూర్: మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని షీటీం ఇన్‌చార్జి భాగ్యశ్రీ,, కమల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే వెంటనే షీటీం బృందానికి సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విఠల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన పీవో

నార్నూర్: మండలంలోని ఉమ్రీ గ్రామానికి చెందిన జాదవ్ సంతోశ్, అంజన దంపతుల కుమారుడు జాదవ్ రాజు జాతీయ స్థాయిలో ఐఐటీలో ఎస్టీ కోటాలో 68 ర్యాంకు సాధించి, ఐఐటీ బాంబేలో సీటు పొందాడు. బుధవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ విద్యార్థిని అభినందించారు. ఐటీడీఏ తరఫున ల్యాప్‌టాప్ అందజేశారు. మారుమూల గ్రామం నుంచి ఉన్నత లక్ష్యంతో చదివి జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన రాజును ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు.

కాంప్లెక్స్ హెచ్ఎంగా యాదగిరి

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ కాంప్లెక్స్ నూతన హెచ్ఎంగా గుండు యాదగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేయటానికి కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు సన్మానించారు.